శాసనమండలి వద్ద సోమవారం ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో మెడలో మిర్చి దండలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్, నవీన్‌కుమార్, తాతా మధు, మహమూద్ అలీ, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు

మిర్చి దండలతో మండలికి

మద్దతు ధర ప్రకటించాలని బీఆర్ఎస్ వినూత్న నిరసన

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని మిర్చి రైతులకు బీఆర్ఎస్ మద్దతుగా నిలిచింది. వారికోసం శాసనమండలి ఆవరణలో ఆ పార్టీ ఎమ్మెల్సీలు వినూత్న నిరసన తెలిపారు. మండలి సమావేశాల్లో భాగంగా సోమవారం ఉదయం మెడలో మిర్చిదండలు వేసుకొని మిర్చి రైతుల సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. మండలిలో ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, సత్యవతి రాథోడ్, నవీన్‌కుమార్, తాతా మధు, మహమూద్ అలీ, నవీన్‌కుమార్‌రెడ్డి, వాణీదేవి, దేశపతి శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిర్చికి మద్దతు ధర లేక పెట్టిన పెట్టుబడులు దక్కవనే ఆందోళనతో రెండు నెలలుగా రైతులు ఆందోళన చేస్తుంటే.. ప్రభుత్వం వారి సమస్యను పట్టించుకోలేదని విమర్శించారు. మిర్చికి క్వింటాల్‌కు రూ.25 వేల మద్దతు ధర కల్పించి నాఫెడ్, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, రాష్ట్రంలో మిర్చి బోర్డు ఏర్పాటుచేయాలని, మిర్చిని సుగంధద్రవ్యాల బోర్డు నుంచి ఆహార పంటల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

రేవంత్ దగాకోరు పాలనతోనే సమస్యలు

సీఎం రేవంత్‌రెడ్డి దగాకోరు పాలనతోనే రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కేసీఆర్ పాలనలో రైతులు గుండెల మీద చెయ్యి వేసుకొని నిద్రపోతే.. నేడు ఎక్కడ చూసినా రైతుల హాహాకారాలు వినిపిస్తున్నాయి. అధికారంలోకి వస్తే క్వింటాల్ మిర్చి రూ.16 వేలకు కొంటామని చెప్పి, ఇప్పుడు వాళ్లను పట్టించుకోవడం లేదు. ప్రభుత్వానికి రైతాంగంపై చిత్తశుద్ధి ఉంటే మిర్చి రైతులకు మద్దతు ధర ప్రకటించాలి.

- సిరికొండ మధుసూదనాచారి, మండలిలో ప్రతిపక్ష నేత

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

మిర్చి పంటకు మద్దతు ధరతో పాటు కరెంట్, సాగునీరు లేక రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఏ ఒక్క మంత్రి కూడా వచ్చి మిర్చి మార్కెట్‌ను సందర్శించలేదు. మిర్చి రైతులను ఆదుకునేందుకు వెంటనే రాష్ట్రంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి. క్వింటాల్‌కు రూ.16 వేల చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

- తాతా మధు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

పొట్టి శ్రీరాములు స్థానంలో సురవరం పేరు

- పేరు మార్పు బిల్లుకు మండలి ఆమోదం
- చర్లపల్లి టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెట్టాలని కేంద్రానికి సీఎం లేఖ

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చి సురవరం ప్రతాపరెడ్డి పేరున నామకరణం చేసేందుకు ఉద్దేశించిన బిల్లును శాసనమండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. సోమవారం శాసనమండలిలో మంత్రి దామోదర రాజనర్సింహ తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం జరిగిన చర్చలో సభ్యులు దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ కవి, రచయిత, వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ఆ తర్వాత సభ్యులు కోదండరాం, మహేశ్‌కుమార్ గౌడ్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఏవీఎన్ రెడ్డి మాట్లాడారు.

పేరు మార్పుపై అసెంబ్లీలో రగడ!

తెలుగు యూనివర్సిటీ పేరును మార్చి సురవరం ప్రతాపరెడ్డి పేర నామకరణం చేసేందుకు ఉద్దేశించిన బిల్లుపై సోమవారం అసెంబ్లీలో వాడీవేడి చర్చ జరిగింది. బీజేపీ సభ్యులు అభ్యంతరం తెలుపగా.. కాంగ్రెస్, ఎంఐఎం, సీపీఐ సభ్యులు సమర్థించారు. చర్చ సందర్భంగా ఎంఐఎం సభ్యుడు బలాలా చేసిన వ్యాఖ్యలు సభలో దుమారం సృష్టించాయి. సోమవారం బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైనందున పేరు మార్పు అనివార్యమైనట్టు, రెండు ప్రాంతాల్లో ఒకే పేరుతో రెండు యూనివర్సిటీలు ఉంటే పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని పేరు మార్చుతున్నట్టు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పేరు మార్పు అంశానికి కొందరు కులాల రంగు పులిమేందుకు ప్రయత్నిస్తున్నారని కాదన్నారు. పొట్టి శ్రీరాములు పేరును చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు, బల్కంపేట నేచర్‌క్యూర్ దవాఖానకు మాజీ సీఎం రోశయ్య పేరు పెడతామని వెల్లడించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అనుమతులు తీసుకొస్తే చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు పొట్టి శ్రీరాములు పేరు పెడతామని స్పష్టంచేశారు. ఈమేరకు కేంద్రమంత్రికి లేఖ రాశారు.

పేర్ల మార్పుపై సిగ్గులేకుండా చర్చ : బలాలా

బీజేపీ సభ్యుల డిమాండ్‌పై ఎంఐఎం సభ్యుడు బలాలా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. చర్లపల్లి స్టేషన్ పేరు మార్చాలని, ఏదో ప్రాంతం పేరు మార్చాలని సిగ్గులేకుండా చర్చిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేస్తూ బలాలా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీపీఐ సభ్యుడు కూనంనేని సాంబశివరావు కూడా పేరు మార్పును సమర్థిస్తున్నట్టు తెలిపారు.

ఓయూకు సురవరం పేరు పెట్టాలి : మహేశ్వర్‌రెడ్డి

బీజేపీ పక్ష నాయకుడు మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు పేరును చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు పెట్టాలనడం సరికాదని, తెలుగు యూనివర్సిటీ పేరును పొట్టి శ్రీరాములు పేరున కొనసాగిస్తూ.. ఉస్మానియా వర్సిటీ పేరును మార్చి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని కోరారు.

ఆర్యవైశ్యులను అవమానిస్తున్న ప్రభుత్వం : సత్యనారాయణ

ప్రభుత్వ నిర్ణయం ఆర్యవైశ్యులను అవమానించడమేనని బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సత్యనారాయణ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు కోసం పొట్టిశ్రీరాములు 55 రోజులు నిరాహార దీక్ష చేసి అమరుడైన విషయాన్ని గుర్తుచేశారు. అలాంటి వ్యక్తి పేరు మార్చడం శోచనీయమని పేర్కొన్నారు. సురవరం ప్రతాపరెడ్డి పేరును కొత్త యూనివర్సిటీలకు పెట్టాలని, లేదంటే ఉస్మానియా వర్సిటీకి పెట్టాలని సూచించారు.

ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకూ అందడం లేదు
- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు అవసరమైన స్థాయిలో మందులు అందడం లేదని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకూ అవసరమైన కొన్ని మందులు లభించడం లేదన్నారు. సోమవారం మండలిలో జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. 'మనిషి జీవితానికి ఒకప్పుడు కూడు, గూడు, గుడ్డ అవసరమయ్యేవి. ప్రస్తుతం వీటికి తోడు వైద్యం కూడా అత్యవసరంగా మారింది. నిత్య జీవితంలో ప్రజల వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. దవాఖానల్లో రోగుల సంఖ్య పెరిగింది. సామాన్యులకు అవసరమైన వైద్యం అందించాలి' అని సూచించారు. కేసీఆర్ హయాంలో పేదలకు అవసరమైన వైద్యం అందించేందుకు ఆరు సూపర్ స్పెషాలిటీ దవాఖానల ఏర్పాటుకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారని గుర్తుచేశారు. ఇటీవల వీటి నిర్మాణపనులు ఆలస్యమవుతున్నాయని, వరంగల్ సూపర్ స్పెషాలిటీ దవాఖాన పనులు మందకోడిగా సాగుతున్నాయని తెలిపారు.

'మన ఊరు..మనబడి' బకాయిలు చెల్లించండి

ప్రభుత్వానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచన

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గుత్తా సుఖేందర్‌రెడ్డి గుర్తుచేయడం గమనార్హం.

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : 'మన ఊరు ..మన బడి ' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల భవనాలు నిర్మించిన కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మరోసారి ప్రభుత్వానికి సూచించారు. బిల్లులు చెల్లించకపోవడంతో వడ్డీల భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ప్రభుత్వానికి గుత్తా లేఖ రాశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో సోమవారం మరోసారి జీరో అవర్‌లో సమస్యను ప్రస్తావించిన చైర్మన్, మార్చి 31లోగా బకాయిలు చెల్లించాలని సూచించారు. ప్రతి సందర్భంలో సభ నుంచి ప్రభుత్వం దృష్టికి తెచ్చినా సమస్య పరిష్కారానికి నోచడం లేదన్నారు. పరిస్థితి తీవ్రతను గుర్తించి ఈ విషయంపై సభలో ప్రస్తావించిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని

అంగన్‌వాడీలకు నిండు జీతాలెప్పుడు?

- 10 నెలలుగా సగం జీతాలే
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- శాసనమండలిలో ప్రత్యేక సెషన్‌లోవివిధ అంశాలను లేవనెత్తిన ఎమ్మెల్సీలు

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 4,000 మంది అంగన్‌వాడీ టీచర్లకు 10 నెలలుగా సగం జీతాలే అందుతున్నాయని, వారికి పూర్తి స్థాయి జీతాలు ఎప్పటినుంచి చెల్లిస్తారో చెప్పాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసనమండలిలో సోమవారం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో మినీ అంగన్‌వాడీలను మేజర్ అంగన్‌వాడీలుగా ఏర్పాటుచేస్తూ 2023 అక్టోబర్‌లో అప్పటి సర్కారు జీవో జారీ చేసిందని తెలిపారు. ఆయా కేంద్రాల్లో పనిచేసే టీచర్లకు చెల్లించే జీతాలను రూ.7,800 నుంచి రూ.13,600కు పెరిగాయని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చాక కేవలం 4 నెలలు మాత్రమే పూర్తిస్థాయి జీతం చెల్లించిందని, ఆ తర్వాత నుంచి 10 నెలలుగా వారికి అర్ధజీతాలు చెల్లిస్తుందని చెప్పారు. క్వింటా మిర్చి పంటకు రూ.25 వేల చొప్పున మద్దతు ధర చెల్లించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు ప్రభుత్వాన్ని కోరారు. జీహెచ్ఎంసీలో మాదిరిగా ఆస్తిపన్ను వడ్డీలో 90 శాతం ఇస్తున్న రాయితీ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. సింగరేణి సంస్థలో కార్మికుల జీతాలలో వ్యత్యాసాలను సవరించాలని ఎమ్మెల్సీ కోదండరాం డిమాండ్ చేశారు.

అకాడమీ పోస్టులను భర్తీచేయాలి: దేశపతి శ్రీనివాస్

రాష్ట్రంలో మూడు రకాల అకాడమీలకు చైర్మన్, డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ సాహిత్య అకాడమీ, తెలంగాణ సంగీత నాటక అకాడమీ, తెలుగు అకాడమీకి ఖాళీపోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. ఆయా అకాడమీలకు బడ్జెట్ కేటాయింపులు కూడా లేవని తెలిపారు. ఉద్యమకారుడు దాశరథి శతజయంతి సందర్భంగా ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో బ్రాహ్మణ పథకాలకు నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ ప్రభుత్వాన్ని కోరారు. బ్రాహ్మణ విదేశీ విద్యకు, పరిషత్తుకు నిధులు కేటాయించాలని కోరారు.

తగ్గిపోతున్న మత్స్యసంపద

-బండా ప్రకాశ్

చేపపిల్లల ఉచిత పంపిణీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ విమర్శించారు. దీనివల్ల రాష్ట్రంలో మత్స్య సంపద తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత చేప పిల్లల పంపిణీని మెరుగుపర్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్యసంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

పీసీసీ చీఫ్‌నే ఆహ్వానించలేదు

బీఆర్ఎస్, బీజేపీలకూ నో ఇన్విటేషన్

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): నియోజకవర్గాల పునర్విభజనలో రాష్ట్రానికి జరిగే అన్యాయంపై ప్రశ్నించేందుకు కాంగ్రెస్ నిర్వహించిన అఖిలపక్షం అభాసుపాలైంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ నేత జానారెడ్డి అధ్యక్షతన సోమవారం అసెంబ్లీ హాల్‌లో జరిగిన అఖిలపక్ష సామావేశానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కే సమాచారం ఇవ్వలేదు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను కూడా సమావేశానికి ఆహ్వానించలేదు. దీనిపై అఖిలపక్ష భేటీని ప్రభుత్వ సమావేశంలా నిర్వహించారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అఖిలపక్ష భేటీకి తనకు ఆహ్వానం అందలేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్వయంగా వెల్లడించారు. అసలు అఖిలపక్ష సమావేశం ఉన్నట్టు తనకు సమాచారం లేదని, తెలిస్తే కచ్చితంగా హాజరయ్యేవాడినని అన్నారు. తమను కూడా పిలవలేదని బీఆర్ఎస్, బీజేపీ నేతలు చెప్పారు. సొంత పార్టీ అధ్యక్షుడిని పిలవకుండా, ప్రధాన పార్టీలను ఆహ్వానించకుండా దానికి అఖిలపక్ష భేటీ అని పేరు పెట్టడమేమిటని ఆయా పార్టీల నేతలు విమర్శించారు. సమావేశం అనంతరం సీనియర్ నేత జానారెడ్డి మాట్లాడుతూ.. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఆహ్వానం అందని తనకు తెలియదని, అదంతా భట్టి విక్రమార్క చూసుకుంటారని తెలిపారు. ఇక తమిళనాడులో ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ నిర్వహించే సమావేశానికి తెలంగాణ తరపున అఖిలపక్ష నేతలు వెళ్తామని తెలిపారు.

నూతన పర్యాటక విధానం జీవో జారీ

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్త టూరిజం పాలసీపై పర్యాటకశాఖ జీవో విడుదల చేసింది. పర్యాటక రంగాన్ని విస్తరణ, పెట్టుబడులు రాబట్టడం, యువతకు ఉపాధి కల్పించడం పాలసీ ఉద్దేశమని టూరిజం సెక్రటరీ జీవోలో పేర్కొన్నారు. ప్రపంచ దేశాల నుంచి పర్యాటకులు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు మౌలిక సదుపాయాలు కూడా మెరుగుపడుతాయని వెల్లడించారు. జీవో విడుదలపై పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తంచేశారు.

8 జిల్లాలకు బీజేపీ అధ్యక్షుల ఎంపిక

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఎనిమిది జిల్లాలకు అధ్యక్షులను ఎంపిక చేసినట్టు సోమవారం ప్రకటించింది. శ్రీనివాస్ రెడ్డి(రంగారెడ్డి జిల్లా), రాజ్ భూపాల్‌గౌడ్(రంగారెడ్డి రూరల్), రాజశేఖర్‌రెడ్డి(వికారాబాద్), నరేందర్‌రావు(నాగర్ కర్నూల్), రామాంజనేయులు(గద్వాల), కోటేశ్వరరావు(ఖమ్మం), ప్రభాకర్ రెడ్డి(భద్రాద్రి), నిరంజన్ యాదవ్(హైదరాబాద్)లకు జిల్లా అధ్యక్షులను ప్రకటించింది. మేడ్చల్ అర్బన్, కరీంనగర్ జిల్లాలను పెండింగ్‌లో ఉంచింది.

అసెంబ్లీని ముట్టడించిన బీఆర్ఎస్వీ

- ఓయూలో నిరసన కార్యక్రమాల రద్దుపై మండిపాటు
- సీఎం రేవంత్‌రెడ్డి డౌన్..డౌన్ అంటూ పెద్దఎత్తున నినాదాలు
- బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లుతోపాటు పలువురి అరెస్టు

అసెంబ్లీ ముట్టడికి యత్నిస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): ఓయూలో విద్యార్థులు నిరసనలు, ధర్నాలు చేయొద్దంటూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బీఆర్ఎస్వీ భగ్గుమంది. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు సోమవారం ఉదయం అసెంబ్లీని ముట్టడించారు. ఈ నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి డౌన్..డౌన్.. అంటూ బీఆర్ఎస్వీ నాయకులు చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. ఈక్రమంలో పోలీసులు బీఆర్ఎస్వీ నాయకులు అసెంబ్లీ లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ నాయకులు మాట్లాడుతూ.. సామాజిక ప్రజా ఉద్యమాలకు వేదికైన ఓయూలో విద్యార్థులు నిరసన కార్యక్రమాలు రద్దు చేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి దొడ్డిదారిలో రావొచ్చు.. కానీ ఓయూ విద్యార్థులు విద్య, నిరుద్యోగ సమస్యల మీద ప్రశ్నిస్తే తప్పు ఎలా అవుతుందని అని నిలదీశారు. ఎంతో ముఖ్యమైన విద్యాశాఖను తన దగ్గర పెట్టుకొని.. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని రద్దు చేయాలనే కుట్రలు మానుకోవాలని డిమాండ్ చేశారు. వంద సంవత్సరాల వర్సిటీ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలా నిర్బంధాలను విధించలేదని ధ్వజమెత్తారు. సమైక్య రాష్ట్రంలో కూడా సీఎం రేవంత్‌రెడ్డి లాగా ఎవరు ఇలా నిర్బంధాలను విధించలేదని మండిపడ్డారు. ముల్కి, తెలంగాణ, సామాజిక ఉద్యమాలకు ప్రజల తరుపున మాట్లాడే గొంతుకలు ఓయూ విద్యార్థులని అన్నారు. అలాంటి వారి స్వేచ్ఛ హరించే విధంగా ఉన్న సర్క్యులర్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగబాలు, నాయకులు గజరాజు చందు, చటరీ దశరథ్, జంగయ్య, రమన్, యశ్వంత్ గుప్తా, అవినాశ్ బాలెంల, నాగేందర్, రాహుల్, శ్రీకాంత్ ముదిరాజ్, అద్వైత్‌రెడ్డి, రాకేశ్, సాయి, ప్రభాకర్, గణేశ్, రాహుల్, రేహమత్ తదితరులను పోలీసులు అరెస్టు చేసి వ్యాన్ ఎక్కించి అక్కడ నుంచి తరలించారు.

'రియల్' కుదేల్

జీహెచ్ఎంసీలో కళ తప్పిన నిర్మాణ రంగం

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్మాణ రంగం కళ తప్పింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారీ నిర్మాణాల అనుమతుల సంఖ్య గణనీయంగా తగ్గినట్టు జీహెచ్ఎంసీ రికార్డులే స్పష్టం చేస్తున్నాయి. గత 15 నెలలుగా కొనసాగుతున్న స్తబ్ధతకు ప్రభుత్వ విధానాల్లోని లోపాలే కారణమని రియల్టర్లు, బిల్డర్లు ఎండగడుతుండటంతో జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల్లో ఆందోళన మొదలైంది. బీఆర్ఎస్ హయాంలో రియల్ ఎస్టేట్ రంగం జోరుగా ముందుకు సాగడంతో టౌన్‌ప్లానింగ్ విభాగానికి వరుసగా మూడేండ్లు రికార్డు స్థాయిలో రాబడి వచ్చింది. 2021-2022 ఆర్థిక సంవత్సరంలో రూ.1,144.08 కోట్లు, 22-23లో రూ.1,454.76 కోట్లు, 2023-24లో రూ.1,107.65 కోట్ల ఆదాయం లభించగా.. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇప్పటివరకు రూ.900 కోట్ల రాబడి మాత్రమే వచ్చింది. వాస్తవానికి ఈ ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి రూ.1,595.56 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు తొలుత అంచనా వేసినప్పటికీ ఆ తర్వాత దాన్ని రూ.1,050 కోట్లకు తగ్గించారు. బడా నిర్మాణాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, రియల్టర్లు జంకుతుండటమే ఇందుకు కారణంగా కనిపిస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జీహెచ్ఎంసీ పరిధిలో నిర్మాణాలకు అనుమతులు తగ్గిపోయాయి. 2023లో మొత్తంలో 39,869 నిర్మాణాలకు అనుమతులు లభించగా.. నిరుడు ఆ సంఖ్య 14,043కు దిగజారింది. ఈ ఏడాది కూడా పరిస్థితి అలాగే ఉన్నట్టు స్పష్టమవుతున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 1,201.15 కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

డీలిమిటేషన్‌పై కాంగ్రెస్‌కు స్పష్టత లేదు

- దేశంలో అందరికన్నా ముందు గొంతెత్తిందే బీఆర్ఎస్
- 22న చెన్నైలో జరిగే అఖిలపక్షానికి హాజరవుతాం
- కేంద్రంతో పోరాడతాం: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): నియోజకవర్గాల పునర్విభజన అంశంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ప్రభుత్వం సోమవారం అఖిలపక్ష సమావేశం ఎందుకు నిర్వహించిందో వారికే తెలియదన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. డీలిమిటేషన్ విషయంలో దేశంలో అందరికన్నా ముందు తామే గొంతు ఎత్తామని గుర్తుచేశారు. డీలిమిటేషన్ వల్ల తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు జరగబోయే నష్టాల గురించి అనేక జాతీయ వేదికల మీద మాట్లాడింది బీఆర్ఎస్ అని స్పష్టం చేశారు. దేశ ప్రయోజనాల కోసం పాటుపడిన దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందని హెచ్చరిస్తూ వచ్చామని అన్నారు. డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వంపై భవిష్యత్తులోనూ పోరాటం చేస్తామని చెప్పారు. అయితే ఈ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు ఉన్న బాధ్యత ఏమిటో చెప్పాలని నిలదీశారు. ఈనెల 22న చెన్నైలో డీఎంకే నిర్వహిస్తున్న సమావేశానికి హాజరవుతామని, బీఆర్ఎస్ గళాన్ని బలంగా వినిపిస్తామని చెప్పారు.

మద్యం ధరలు 18శాతం పెంపు?

మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వం మద్యం ధరల పెంపునకు ఆమోద ముద్ర వేసే అవకాశం ఉన్నదని ఏజెన్సీలు చెప్తున్నయి.ఇటీవలి కాలంలో బీరు ధరలు పెంచిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తాజాగా బ్రాందీ, విస్కీ, స్కాచ్, రమ్ ధరలు పెంచాలని నిర్ణయించింది. ప్రభుత్వం నియమించిన ప్రైస్ ఫిక్సేషన్ కమిటీ వ్యాపారులతో మాట్లాడి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకున్నది. వ్యాపారుల తరపున ఉత్తర తెలంగాణకు చెందిన ఎమ్మెల్యే వ్యవహారం నడిపినట్టు తెలిసింది. ఆయన సూచనలు, సలహాలకు అనుగుణంగానే మద్యం ధరల పెంపు మీద తుది కసరత్తు చేసినట్టు సమాచారం. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా ఉండటం కోసం ధరల నిర్ణయాల కమిటీ 15 శాతం నుంచి 20 శాతం వరకు ధరలు పెంచవచ్చని ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిసింది. మధ్యే మార్గంగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 18 శాతం పెంచటానికి అంగీకరించినట్టు తెలిసింది. ఈ మేరకు ఫైల్ ముఖ్యమంత్రి వద్ద ఉన్నట్టు తెలిసింది. మద్యం సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం లిక్కర్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందం జూన్ 30తో ముగియనుంది. జూలై ఒకటి నుంచి కొత్త ఒప్పందం అమల్లోకి రానుంది. ఈ లోపే మద్యం ధరలు పెంచి, డిస్ట్రిలరీలు, డిస్ట్రిబ్యూటర్స్, సప్లయ్ కంపెనీలతో ఒప్పందాలకు వెళ్లాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నది. ఏప్రిల్ మొదటి వారంలో ధరలు పెంచి, ఆ వెంటనే ఒప్పందాలు చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది.

ఓయూలో ఆంక్షలు అప్రజాస్వామికం

- పోరాటాల పురిటిగడ్డ, తెలంగాణ ఉద్యమానికి గుండెకాయ ఉస్మానియా యూనివర్సిటీ
- నిరసనహక్కును హరించడం అమానుషం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్, మార్చి 17 (నమస్తే తెలంగాణ): పోరాటాల పురిటిగడ్డ, తెలంగాణ ఉద్యమానికి గుండెకాయలాంటి ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు విధించడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైరయ్యారు. నిరసన తెలిపే హక్కును హరిస్తూ ఆంక్షలు విధించడం అమానుషమని సోమవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. 'ఇది పూర్తి రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ఓయూలో విద్యార్థుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్